# నమస్తే తెలంగాణ

## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి



**చెప్పిందొకటి.. చేసిందొకటి!**

### కేసీఆర్ మాఫీ చేసినప్పుడు ఇప్పుడెందుకు కాదు?



టేకుమట్ల: నాకు గతేడాది కేసీఆర్ సార్ రూ.90 వేల రుణం మాఫీ చేసిండు. ఎన్నికలప్పుడు రేవంత్‌రెడ్డి మళ్లీ లోన్లు తీసుకోండ్లి.. మాఫీ చేస్తానని మాట ఇచ్చిం డు. కానీ, ఇప్పుడు నాకు రుణమాఫీ కాలేదు. ఎం దుకని అడిగితే నా కొడుకు రుణం కూడా కలిపి ఇద్దరి రూ.లక్ష దాటింది. తర్వాత మాఫీ అయితది అంటున్నరు. ఎవరి రుణం వాళ్లకే మాఫీ చేయాలె.. ఇట్ల లింకు పెట్టుడేంది. ఒకేసారి మొత్తం రుణం మాఫీ చేస్తామని ఇలా కాలయాపన చేసుడేంది. అప్పుడు కేసీఆర్ అట్ల చేయలేదు కదా.., ఎవరి అప్పు వాళ్లకే మాఫీ చేసిండు. ఇప్పుడు కూడా అట్లనే చేయాలె.

*– శీర్ల రాజేశ్వర్‌రావు, రామకృష్ణాపూర్(వి)*



నర్సింహులపేట : ఏవో ఆఫీస్‌లో వివరాలు తెలుసుకుంటున్న రైతులు

### రుణమాఫీ కాలేదు..



ములుగు, జూలై 19 (నమస్తేతెలంగాణ): నేను ములుగులోని కెనరా బ్యాంకులో 2020లో రూ. 20 వేలు వ్యవసాయ రుణం తీసుకున్నా. రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే.. నీకు రుణమాఫీ కాలే దు.. వడ్డీతో కలిపి రూ.31వేలు కట్టమంటున్నరు. ఏడాది కిందటనే అప్పు కడుదామని బ్యాంకుకు వెళ్తే అధికారులు మాఫీ అవుతుందని చెప్పడంతో కట్టలేదు. ఇప్పుడు రుణమాఫీలో నీ పేరు లేదంటున్నరు. ఇప్పటికిప్పుడు రూ.31వేలు కట్టలేనని బ్యాంకు వాళ్లకు చెబితే మరో నాలుగు రోజులు చూద్దాం.. ఎవరిని అడగాలో, ఏం చేయాలో అర్థంకావడం లేదు.

*– మూడ్ జీవన్‌లాల్, రంగారావుపల్లి, ములుగు*

### పేర్లు లేని రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయండి

*ములుగు డీఏఓ విజయ్‌చంద్ర వెల్లడి*

ములుగు, జూలై 19(నమస్తే తెలంగాణ) : సాంకేతిక సమస్యతో పాటు ఇతర కారణాల వల్ల రుణ మాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు మండలకేంద్రాల్లో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేస్తే రుణమాఫీకి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని ములుగు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్‌సెల్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారితో పాటు కిందిస్థాయి సిబ్బందికి విధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే కలెక్టరేట్‌లోనూ ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామని, రుణమాఫీ జాబితాలో పేర్లు లేని అర్హులైన రైతులు ఎవరైనా ఉంటే గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని అర్హులైన ప్రతీ రైతుకు వర్తింపజేస్తామని డీఏవో చెప్పారు.

### రెన్యువల్‌కు పైసలియ్యాల్నట



మహబూబాబాద్ రూరల్: నాకు రూ. 69వేల రుణం మాఫీ అయిందని చెప్పిండ్రు. రుణం మాఫీ కావాలంటే రెన్యువల్‌కు రూ.3,400 బ్యాంకులో కట్టమంటున్నరు. రుణం మాఫీ అయిన తర్వాత ఎందుకు కట్టాలంటే అధికారుల దగ్గర సమాధానం లేదు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం బ్యాంకర్లకు సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో చాలామందికి అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఇబ్బంది కలుగకుండా రుణమాఫీపై బ్యాంకులకు సరైన సూచనలు ఇవ్వాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

*– గొర్రె పూలమ్మ, జమాండ్లపల్లి*

### సారూ.. నా పేరుందా? లోన్ మాఫీ అయిందా?

రుణమాఫీ అయిందో? కాలేదో? తెలియక రైతులు తికమకపడుతున్నారు. పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు పట్టుకొని అటు వ్యవసాయ శాఖ కార్యాలయానికి, బ్యాంకుల వద్ద పరుగులు తీస్తున్నారు. ఏవో దగ్గరికి వెళ్తే బ్యాంకుకు వెళ్లాలని.. అక్కడికి వెళ్తే ఇక్కడికి అని తిప్పుతుండడంతో బేజార్ అవుతున్నారు. శుక్రవారం ఇలా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చిన రైతులు సిబ్బందిని ఆరా తీశారు. అర్హత ఉన్నా మాఫీ ఎందుకు కాలేదని అడిగితే తమకు తెలియదని వ్యవసాయ శాఖ అధికారులను అడుగాలని చెప్పడంతో అసహనానికి గురయ్యారు. రేవంత్ సర్కారు చెప్పిందొకటి.. చేసేదొకటి అంటూ నిట్టూర్చుతూ అక్కడి నుంచి వెళ్లిపోవడం కనిపించింది.

– మహబూబాబాద్, జూలై 19(నమస్తే తెలంగాణ)





భూపాలపల్లిలోని ఎస్‌బీఐ ఎదుట అంటించిన రుణ మాఫీ జాబితాలో పేర్లను చూసుకుంటున్న రైతులు

# నో క్లారిటీ..!

## రుణమాఫీపై కొనసాగుతున్న సస్పెన్స్

- లోన్ మాఫీ అయిందో లేదోనని అయోమయం
- స్పష్టత ఇవ్వని బ్యాంకులు, అగ్రికల్చర్ అధికారులు
- వివరాలు తెలియిక ఆగమవుతున్న రైతులు
- బ్యాంకుల వద్దకు పరుగులు
- సమాధానం దొరకక తిప్పలు

వరంగల్, జూలై 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతులకు రుణ మాఫీ రంది పట్టుకున్నది. లోన్ మాఫీ అయిందా? కాలేదా? అనే స్పష్టత లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం నుంచి ఈ ఉత్కంఠ ఇలాగే కొనసాగుతుండగా శుక్రవారం ఉదయం పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులతో బ్యాంకులకు పరుగులు తీశారు. అక్కడ ఆరా తీసినా వివరాలు తెలియకపోవడంతో నిరాశతో ఇంటిబాట పట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించినా ఇప్పటికీ వీటిపై రైతుల్లో అయోమయం నెలకొన్నది. రుణ మాఫీ ప్రకటన జరిగి 24గంటలు గడిచినా తాము తీసుకున్న లోన్లు ఏమయ్యాయో వారికి అంతుచిక్కడంలేదు. రుణాల మాఫీపై స్పష్టత కోసం భారీ సంఖ్యలో రైతులు బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తున్నారు. బ్యాంకర్ల నుంచి దీనిపై సరైన సమాధానం రావడంలేదు. గ్రామాల వారీగా గానీ, బ్యాంకుల వారీగా గానీ లోన్లు మాఫీ అయిన వారి పేర్ల జాబితా అందుబాటులో లేక అందరూ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు నిబంధన పెట్టడం వల్ల తమ రుణాలు ఏమయ్యాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబంలో ఒక్కరికే లోను మాఫీ అనడంతో ఎవరెవరికి మాఫీ అయ్యాయో తెలియడం లేదు. అప్పటినుంచి రైతులు తమ సెల్ ఫోన్లను చూసుకుంటున్నారు. లోనుకు సరిపడా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులో జమ చేస్తున్నట్లుగా ఫోన్లకు మెసేజ్‌లు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరకు ఎదురుచూశారు. ఎలాంటి మెసేజ్‌లు రాకపోవడంతో బ్యాంకులకు వెళ్లి లోను మాఫీ గురించి ఆరా తీస్తున్నారు.

**నిబంధనలే కారణమా..**

కేసీఆర్ ప్రభుత్వం తరహాలో ప్రతి రైతు రుణాలు మాఫీ అవుతాయని అందరూ ఆశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రకరకాల నిబంధనలను పెట్టడంతో ఇప్పుడు రైతుల్లో ఆందోళన నెలకొన్నది. రేషన్‌కార్డు ప్రాతిపదికగా కుటుంబంలో ఒక్కరికే లోను మాఫీ చేస్తామనే నిబంధనలో ఎవరెవరికి రుణాలు మాఫీ అయ్యాయనేది అర్థం కావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా అందరికీ పంట రుణాలు మాఫీ చేసింది. దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికే మాఫీ చేస్తుండడంతో ఎక్కువ మందిలో ఆందోళన ఉన్నది. రుణ మాఫీ అయిన రైతుల జాబితాను ఎక్కడా వెల్లడించకపోవడంతో ఈ ఆందోళన పెరుగుతున్నది. లోన్లు మాఫీ అయిన వారి జాబితాను వెంటనే ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రైతుల జాబితాను వాట్సాప్, ఇతర సోషల్ మీడియాల్లో ప్రచారం అయ్యాయి. మాఫీ అయిన వారి జాబితానా? రుణమాఫీకి అర్హుల జాబితానా? అనేది స్పష్టత రావడం లేదు.

**సహకార లోన్లదీ అదే పరిస్థితి**

వ్యవసాయ సహకార సంఘాలో లోన్లు తీసుకున్న వారి పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉన్నది. బ్రాంచీల వారీగా మాఫీ అయిన వారి జాబితాలు బయటికి ఇవ్వడం లేదు. ఎక్కువ శాఖల్లో అర్హుల పేర్లతో ఉన్న జాబితాలు అందరికీ వచ్చాయి. వీటిపై ఆరా తీయగా ఆ పేర్లు లోన్లు మాఫీ అయిన వారికి కాదని, మాఫీ కోసం బ్రాంచీల నుంచి ప్రభుత్వానికి పంపిన జాబితాలను అని అధికారులు చెప్పారు.

### అరచేతిలో బెల్లం పెట్టింది..



నల్లబెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో అన్నదాతల అరచేతిలో బెల్లం పెట్టింది తప్ప.. చేసిందేమీ లేదు. గ్రామానికో 10 మంది లెక్కన రుణమాఫీ చేసిండ్రు. సీఎం రేవంత్‌రెడ్డి సార్ రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ చేస్తమని చెప్పి, మాట తప్పిండు. వ్యవసాయశాఖ కార్యాలయంలో రుణమాఫీ వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్ లింక్ చేస్తే సంబంధిత వ్యక్తికి రేషన్‌కార్డు లేనందున మాఫీ వర్తించదని స్పష్టంగా చూపిస్తున్నది. అలాగే అదే ఆధార్‌లింక్‌తో కుటుంబంలో ఎంత మందికి ఏయే బ్యాంకుల్లో క్రాపులోన్ ఉందనే సమాచారం కూడా వస్తున్నది. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబంలో ఒకే వ్యక్తికి ఒకే క్రాప్‌లోన్ ఉన్న వారికి మాత్రమే మొదటి విడుతలో రుణం మాఫీ చేసినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించింది. ఇది స్థానిక ఎన్నికల కోసం ప్రభుత్వం చేస్తున్న జిమ్మిక్కుగా అర్థమవుతున్నది.

*–గుగులోత్ సారయ్య, రేలకుంట*

### వరంగల్‌లో రుణమాఫీపై 21 ఫిర్యాదులు

ఖిలావరంగల్: రుణమాఫీపై వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు శుక్రవారం 21 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 21మంది రైతులు టోల్‌ఫ్రీ నంబర్ 18004253434, మొబైల్ నంబర్ 9154252936 లకు ఫోన్ చేసి సమస్యలు తెలిపినట్లు అధికారులు తెలిపారు. తమ పేర్లు లేవని కొందరు.. లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అని మరికొందరు అడిగి తెలుసుకున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం వద్ద కల్వర్ట్ పైనుంచి పారుతున్న అలుగు వాగు

# ముంచెత్తిన వాన

- ములుగు, భూపాలపల్లిలో ఉప్పొంగుతున్న గోదావరి
- కాటారంలో తీవ్ర ప్రభావం



కొట్టుకుపోయిన ఆటో ట్రాలీ


కాటారం/మహదేవపూర్/కాళేశ్వరం/వాజేడు/ఏటూరునాగారం : జిల్లాలో శుక్రవారం వాన ముంచెత్తింది. కాటారం మండలంలో 141.8 మి.మీ వాన పడడంతో జనజీవనం స్తంభించింది. మహదేవపూర్, భూపాలపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు మత్తళ్లు పోయగా, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాటారం మండలంలోని గంగారం అలుగువాగు, పోతుల్ వాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం అలుగువాగు భారీ వర్షానికి పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దామెర కుంట–గుండ్రాత్‌పల్లి మధ్యలోని అలుగు వాగులో బొలెరో ట్రాలీ వాహనం కొట్టుకుపోయింది. గ్రామస్తులు డ్రైవర్‌ను రక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మహాముత్తారం మండలం నిమ్మగూడేనికి చెందిన టీ శంకర్‌కు తేలు కుట్టగా, 108కి ఫోన్ చేయగా అంబులెన్స్ పోతుల్వాయి వద్దకు రాగానే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిలిచిపోయింది. శంకర్‌ను అధికారులు, స్థానికులు వాగు దాటించి 108 అంబులెన్స్‌లో మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**ఉధృతంగా గోదావరి**


కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తూ 3.73 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. 08.01 మీటర్ల ఎత్తులో పారుతూ లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నాయి. గంట గంటకూ భారీగా పెరుగుతుండడంతో అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. వాజేడు మండలంలోని పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి ఉప్పొంగి పారుతోంది. పేరూరు వద్ద 12.730 మీటర్లు(40) అడుగులకు నీటిమట్టం చేరుకున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ఏటూరునాగారం పుష్కరఘాట్ వద్ద 11.710 మీటర్లతో గోదావరి ప్రవహిస్తుంది. దీంతో దెబ్బతిన్న కరకట్ట వద్ద నీటి పారుదలశాఖ అధికారులు ఇసుక బస్తాలు వేసి పనులు చేస్తున్నారు.

**గోదావరిలో వ్యక్తి గల్లంతు**

వెంకటాపురం(నూగూరు): మండల పరిధిలోని అలుబాక పంచాయతీ తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) చేపల వేటకని గురువారం గోదావరి నదికి వెళ్లి గల్లంతయ్యాడు. రెవెన్యూ, పోలీస్ అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.



వాజేడు : పూసూరు బ్రిడ్జి వద్ద ఉధృతంగా గోదావరి



కాటారం: పోతుల్వాయి బొర్రవాగు వద్ద నిలిచిపోయిన అంబులెన్స్



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద పారుతున్న గోదావరి నది



కాటారం: శంకరాంపల్లిలో నీట మునిగిన పత్తి చేను





























